# మహిళలు సమానత్వం - సాధికారతకై ఉద్యమించాలి



## భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ


మార్చి-అంతర్జాతీయ మహిళా దినోత్సవం
ఉమ్మడి కనీస కార్యక్రమాన్ని వేగవంతంగా
అమలు చేయాలన్న డిమాండ్ పై మహిళల సదస
ఎ.పి.మహిళా సమఖ్య ఐద్వా జె.డబ్ల్యూ.పి.
ఎ.పి.ఎం.ఎస్.ఎస్. వై.డబ్ల్యూ.సి.ఎ.



# మహిళలు సమానత్వం - సాధికారతకై ఉద్యమించాలి

సమాజంలో సగభాగం, దేశ జనాభాలో సగభాగంగా వున్న మహిళలు నేడు ఇంటా, బయట అనేక రకాల సాంఘీక వివక్షతకు, శారీరక, మానసిక దాడులకు గురౌతున్నారు. ఆర్థిక, రాజకీయ రంగాల్లో కూడా వీరిని అణిచిపెట్టి వుంచే వైఖరే సమాజంలో పాతుకుపోయింది. చెప్పడానికే ఆదిశక్తి అంటారుగానీ ఆచరణలో మహిళ స్వతంత్రురాలు కాదని, బాల్యంలో తండ్రి, వివాహానంతరం భర్త, వృద్ధాప్యంలో కొడుకు సంరక్షణలో బ్రతకాల్సిందేనని మత గ్రంధాల ప్రచారం. భారత సమాజంలో పురుషాధిక్యత భావజాలంతో మహిళ అణచివేయబడుతున్నది. విద్య, ఉద్యోగాల్లో పురుషులకన్నా వెనుకబాటు, సమానవేతనాలకు వీరు దూరంగా, చివరికి వీరిపై అత్యాచారాలు, హత్యలు నిత్యకృత్యంగా సాగుతున్నాయి. భారత రాజ్యాంగం ప్రకారం పౌరులందరూ సమానమే. కానీ ఫ్యూడల్ భావజాలాలు సమాజంపై ఎక్కువ ప్రభావం వుండడం వల్లన మత ప్రచారకులే కాదు పాలకపార్టీల రాజకీయ నాయకులు కూడా నిస్సిగ్గుగా ఆ భావాలనే ప్రచారం చేస్తున్నారు.

"నస్త్రీ స్వాతంత్ర్యమర్హతి" అనే ధోరణి పై సమాజంలో తిరుగుబాటు రావాలి. పురుషుల్తోపాటు అన్ని రంగాల్లో రాణించగల సత్తా వుందని నేడు మహిళలు రుజువు చేసుకొంటున్నారు. ఈ పరిణామాన్ని స్వాగతించాలి. సమాజ సగభాగంగా ఉన్నవీరు ఉత్పత్తి ప్రక్రియ నుండి రాజకీయ స్థాయివరకు సమాన భాగస్వాములైతేనే దేశం ప్రగతి పథంలో పయనిస్తుందని సిపియం ప్రగాఢ విశ్వాసం. దీనికోసం సిపిఎం సంస్కరణోద్యమాల్ని మహిళా, ప్రజా ఉద్యమాల్ని నిర్మిస్తుంది; అనేక విధాలుగా దీనికై సాగే ప్రస్థానంలో పాల్గొంటుంది. మహిళలకు సమాన హక్కులు, భద్రత, సాధికారతకై విశాల ఉద్యమం సాగాలని, ప్రజాతంత్ర వాదులు, అభ్యుదయవాదులు దీనిలో భాగస్వాములవ్వాలని సాదరంగా ఆహ్వానిస్తున్నాం.

## విద్య

మహిళల అక్షరాస్యత మానవాభివృద్ధికి కీలకం. జాతీయ అక్షరాస్యత 82శాతం. మన రాష్ట్రంలో 67శాతం. అందులో మహిళా అక్షరాస్యత 59శాతమే. అక్షర క్రమంలో ముందున్నా అక్షరాస్యతలో మాత్రం అనేక చిన్న రాష్ట్రాలకన్నా చాలా వెనకబడి 28వ స్థానంలో వున్నాం. 68సంవత్సరాల స్వాతంత్ర్యానంతరం కూడా సంపూర్ణ అక్షరాస్యత పట్ల పాలకుల నిర్లక్ష్యానికి అంకెలు అద్దం పడతాయి.

**బడి మానేస్తున్న ఆడపిల్లలు :** స్కూళ్ళలో చేరుతున్న 100మంది పిల్లల్లో 5వ తరగతికి 69 మంది, 7వ తరగతికి 48మంది, 10వ తరగతికి 38 మంది మాత్రమే మిగులుతున్నారు. ఎస్‌సి, ఎస్‌టి పిల్లల్లో 50 శాతం పైన బడి మానేస్తున్నారు. ఎస్.టి. అమ్మాయిల్లో72 శాతం, ఎస్.సి. అమ్మాయిలలో 68 శాతం మానేస్తున్నారు. అభివృద్ధి చెందిన జిల్లాలుగా చెప్పబడుతున్న గుంటూరు, పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి, కృష్ణాజిల్లాల్లో 41శాతం పైగా పిల్లలు బడి మానివేయడం ఆందోళనకరం. ఎస్‌సి అమ్మాయిలు ప్రాథమిక ఉన్నత స్థాయిలో 61 శాతం, ఎస్‌టి అమ్మాయిలు 78 శాతం బడి మానేస్తున్నారు. మైనార్టీ మహిళల్లో అక్షరాస్యత 36 శాతం మాత్రమే. గిరిజన ప్రాంతాలలో విద్య, ఆరోగ్యం, మౌలిక సదుపాయాలు అత్యంత హీనంగా ఉన్నాయి. గిరిజనులు అత్యధిక శాతం ఉన్న విశాఖలో గిరిజన మహిళల అక్షరాస్యత 25శాతం మాత్రమే. గిరిజన సంక్షేమ హాస్టల్స్, కస్తూర్బా విద్యాలయాలు, గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలు ఉన్నప్పటికీ చాలా చోట్ల టీచర్లు అందుబాటులో ఉండరు. హాస్టల్స్‌లో పిల్లలకు సరైన వసతులు, రక్షణ కానీ లేదు. కొన్ని చోట్ల హాస్టల్స్‌లో వార్డెన్లు కీచకులుగా మారి బాలికలపై అత్యాచారాలు చేయడం చూస్తున్నాం.

### ఎందుకు బడి మానేయిస్తున్నారు?

1. **దారిద్ర్యం:** ఇంటి దగ్గర చిన్న పిల్లల ఆలనాపాలనా చూడడానికి, ఇంటిపని, వంటపని చేయడానికి బాలికలను చదువు మాన్పిస్తున్నారు. పట్టణ ప్రాంతాలలో కంటె గ్రామీణప్రాంతాలలో ఇతర కులాల కంటే దళిత, గిరిజన బాలికల్లో చదువు మాన్పించడానికి ప్రధాన కారణం పేదరికమే. ఆంధ్రప్రదేశ్‌లో 7శాతం మంది అనగా 13,63,339

మంది బాల కార్మికులు ఉన్నారు. అత్యధికంగా బాలకార్మికులు కలిగి వున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ముందున్నది.

**2. సామాజిక కారణాలు** : 33 శాతం మంది తల్లిదండ్రులు ఆడపిల్లల చదువులు పెళ్ళికి సమస్యగా భావించి మధ్యలోనే మాన్పిస్తున్నారు.

**3. కనీస వసతుల లేమి:** ఇప్పటికీ తరగతి గదులు, సరిపడా టీచర్లు లేని స్కూళ్ళ సంఖ్య ఎక్కువే. ఉన్న స్కూళ్లల్లో కూడా టాయిలెట్స్ సదుపాయం లేని స్కూళ్ళే ఎక్కువ. 89శాతం స్కూళ్ళల్లో ఆడపిల్లలకి ప్రత్యేక శానిటేషన్ సదుపాయాలు లేవు. ఆడపిల్లలు బడిమానివేయడానికి ఇదొక కారణం.

4. **రవాణా సదుపాయాలు** : స్కూళ్ళు, కాలేజీలకు వెళ్ళడానికి రవాణా సౌకర్యాలు తగినన్ని అందుబాటులో లేకపోవడంతో భద్రత రీత్యా తల్లిదండ్రులు పై చదువులకు ప్రోత్సహించడంలేదు.

**5. భద్రత లేకపోవడం:** స్కూళ్ళల్లోనూ, బయట పెరుగుతున్న అత్యాచారాలు, హాస్టళ్ళలో కూడా భద్రత లేనందున బడి మాన్పిస్తున్నారు. ఈ సమస్యలు పరిష్కరించకుండా మహిళల్లో విద్యాశాతం పెరగదు.

**ఆడపిల్లల విద్యాభివృద్ధికి తీసుకోవల్సిన చర్యలు :** కనీసం 10వ తరగతి వరకు ప్రతి ఆడపిల్ల చదువుకోవలసిన అవసరాన్ని, చదువుద్వారా వచ్చే సామాజిక ప్రయోజనాలను విస్తృతంగా ప్రచారం చేయాలి. సంపూర్ణ అక్షరాస్యతా సాధన మహిళల అక్షరాస్యత పెరగడానికి దోహదపడుతుంది. స్కూలు అందుబాటులో వుండాలి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా నాణ్యత పెంచాలి. 10వ తరగతి వరకు ఏకీకృతమైన సిలబస్, స్కూళ్ళు అవసరం. ఉపాధ్యాయులు కూడా సామాజిక బాధ్యతగా ఆడపిల్లల్లో విద్యా వికాసానికి తోడ్పడాలి. బాల కార్మిక వ్యవస్థని సంపూర్ణంగా నిషేధించాలి. సృజనాత్మకమైన చదువులు, ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆత్మవిశ్వాసం పెంపొందేలా విద్యావిధానం, బోధన వుండాలి. ఉచిత రవాణా సదుపాయాలు కల్పించటం అత్యంత అవసరం. చదువుల్లో ఆడపిల్లల్ని ప్రోత్సహించడానికి స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలి. మరుగుదొడ్లు, మంచినీరు మొదలగు సౌకర్యాలు ప్రతి విద్యాలయంలో కల్పించాలి.

## ఆరోగ్యం

పూర్తి ఆరోగ్యం అంటె స్త్రీ శారీరక, మానసికబుద్ధి అన్నీ బాగుండటం, శక్తివంతంగా ఉండటం. స్త్రీ ఆరోగ్య ప్రభావం పిల్లలు, కుటుంబంపై ఎక్కువగా వుంటుంది. ఆడపిల్ల కడుపులో ఉన్నప్పటినుంచే వివక్ష మొదలవుతుంది. దేశ వ్యాప్తంగా 55.3 శాతం మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారు. మనరాష్ట్రంలో 62.9% మహిళలు రక్తహీనతతో ఉన్నారు. పాలిచ్చే తల్లుల్లో 73% రక్తహీనత ఉంది. 43% బాలికలు పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నట్లు జాతీయ కుటుంబ సర్వేలో తేల్చింది. వివిధ కమిటీల అంచనా మేరకు 40 నుండి 50% ప్రజలు పేదరికం కారణంగా పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారు. పౌష్టికాహారం లేని కారణంగా ప్రసవ సమయంలో బాలింతల మరణాలు సంభవిస్తున్నాయి. ఏడాదికి 75 లక్షల మంది నవ శిశువులు భారతదేశంలో తక్కువ బరువుతో జన్మిస్తున్నారు. వయసుకు తగిన ఎత్తు, బరువు లేకపోవటం పౌష్టికాహార లోపమే.

స్త్రీలలో పౌష్టికాహారలోపానికి పెరిగే ధరలు ప్రధాన కారణం. ఆహార ధరలు, ద్రవ్యోల్బణంపై – ఆసియా అభివృద్ధి నివేదికలో 10% ఆహార వస్తువుల ధరలు పెరిగితే మనదేశంలో 3 కోట్ల మంది అదనంగా దారిద్ర్యంలోకి నెట్టబడ్డారని దీనితో వీరు మరింతగా పౌష్టికాహారలేమికి గురవుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో బి.ఎమ్.ఐ 20.9 గా ఉన్నది. 49% మహిళలు 18.5 బి.ఎమ్.ఐ కంటె తక్కువగా ఉన్నారు. కేరళ, తమిళనాడులో మనకంటే మహిళల ఆరోగ్య స్థితి మెరుగుగా ఉన్నది. దీనికి కారణం పౌష్టికాహార లభ్యత, ప్రాధమిక ఆరోగ్య కేంద్రాల అందుబాటు మన కంటే మెరుగ్గా ఉండటమే. శిశుమరణాలు కూడా మన రాష్ట్రంలో అధికంగానే ఉన్నాయి. ప్రతి వెయ్యిమందికి 49 మంది చిన్నారులు మరణిస్తున్నారు. దీనిని 30కి తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నా ఆచరణలో తీసుకొనే చర్యలు లేకపోవడంతో రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో వెయ్యికి 50 మంది శిశువులు చనిపోతున్నట్లు వివిధ సంస్థల నిర్ధారణ. కేరళలో ఈ సంఖ్య ఆరు మాత్రమే! ఆడపిల్లల పోషణ విషయంలో ఉన్న తీవ్రమైన వివక్షత, బాల్యవివాహాలు, స్త్రీల ఆరోగ్యం యెడల అశ్రద్ధ తదితర కారణాలతో 18 నుండి 30 సంవత్సరాల్లోపు మహిళలు ఎక్కువగా మరణాలకు గురవుతున్నారు. స్త్రీలకు

వస్తున్న ఇతర జబ్బులకు సంబంధించి వైద్య సదుపాయాల కల్పన అత్యంత నామమాత్రంగా వుంది.

**గిరిజన మహిళ :** గిరిజనులు సుదూర ప్రాంతాలకు వెళ్ళి రేషన్ తెచ్చుకోవలసివస్తుంది. మూడు నెలలకు ఒకసారి తెచ్చుకుంటున్న సందర్భాలు కూడా ఎక్కువే. గిరిజన మహిళల్లో నూటికి 95శాతం మంది పోషకాహారం లేక రక్తహీనతతో రోగాల బారిన పడుతున్నారు. గతంలో గిరిజన ప్రాంతాల్లో ఇస్తున్న పౌష్టికాహారాన్ని కూడా ఇటీవల ఆపేశారు. విద్యుత్‌లేని గ్రామాలు, రోడ్లు లేని తండాలు, మంచినీరు అందని గిరిజన గూడేలు అడుగడుగునా దర్శనమిస్తాయి. నాలుగు నుంచి ఐదు కిలో మీటర్లు దూరం వెళ్ళి కొండల్లో వస్తున్న ఊటల నుంచి మంచినీరు తెచ్చుకోవాలి. వర్షా కాలంలో బురద నీటితో మలేరియా, టైఫాయిడ్, కలరా, డయేరియా వంటి రోగాలతో మహిళలు, పిల్లలు వందల సంఖ్యలో చనిపోతున్నారు. ప్రజల ఆరోగ్యం పాలకులకు పట్టదుగానీ ప్రగతి గురించిన కబుర్లకేమీకొదవుండదు.

## ఇంటి చాకిరి పనికాదా?

ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు ఇళ్లలో మహిళలు చేసే పనికి ఏమాత్రం విలువ దక్కడం లేదు. రోజంతా రెక్కలు ముక్కలు చేసుకున్నా 'ఆమె ఏమీ పని చేయదు. ఇంటిలోనే ఉంటుంది' అనే వెక్కిరింత వ్యాఖ్యలే వినపడతాయి. పట్టణాల్లో ఉద్యోగాలు చేసే మహిళలకు, పల్లెల్లో ఏదో ఒక పని చేసే మహిళలకూ ఇంటిపని భారం తప్పడం లేదు. ఇంటిపని మహిళల బాధ్యతే అన్న తరతరాల బూజు పట్టిన సాంప్రదాయమే దీనికి కారణం. 2011-12లో నేషనల్ శాంపిల్ సర్వే ఆర్గనైజేషన్ (ఎన్ఎస్ఎస్ఓ) చేసిన సర్వే ప్రకారం పట్టణ ప్రాంతాల్లో ఉద్యోగాలు, ఇతర ఉపాధి కార్యక్రమాలు చేస్తూ ఇంటిపని బరువు మోస్తున్న వారి సంఖ్య 64శాతం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ఈ సంఖ్య 80శాతం ఉంది. సంస్కరణల ప్రభావం పెరిగే కొద్దీ ఈ సంఖ్య మరింత పెరుగుతోంది. 2013-14 సంవత్సరానికి ముంబాయిలో ఒక స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన సర్వేలో ఈ సంఖ్య 75శాతానికి పెరిగింది. సర్వేలో పాల్గొన్న వారిలో దాదాపు అందరూ మరో ప్రత్యామ్నాయం లేదని, పని భారం తగ్గించుకునే మార్గం ఏదైనా ఉంటే బావుంటుందన్న స్త్రీల ఇంటిపనిని కూడా జాతీయాదాయంలో

లెక్కించాలని మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. తగిన సంఖ్యలో పిల్లల సంరక్షణా కేంద్రాలు (క్రష్‌లు), సామూహిక భోజనశాలలు, వృద్ధాప్య కేంద్రాల ఏర్పాటు వంటి చర్యలతో ఇంటి పనిభారం నుంచి స్త్రీలను కొంతైనా విముక్తి చేయవచ్చు. అయితే ఈ విషయాన్ని పాలకవర్గాలు ఏమాత్రం పట్టించుకోవుగదా!

## మహిళల పని – ఉపాధి – వివక్షత

వ్యవసాయ రంగంలోనే మహిళలు అత్యధిక శాతం పనిచేస్తున్నారు. కానీ పురుషులు పొందే వేతనంలో సగం మాత్రమే వీరికి దక్కేది. వ్యవసాయ రంగంలో కూడా యాంత్రీకరణ వల్ల పనులు తగ్గాయి. లక్షలాది ఎకరాల పంటభూములను అడ్డగోలుగా కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేయడంతో సుదూర ప్రాంతాలకు వలసలు పెరిగాయి. భవన నిర్మాణ పనుల్లో, ఇంటి పనివారలుగా, హాకర్స్‌గా, షాపుఉద్యోగులుగా విభిన్న పనులలో మహిళలు చేరుతున్నారు. నూతన ఆర్థిక విధానాల నేపథ్యంలో పెరుగుతున్న ధరలు, ఖర్చులతో మహిళలు కూడా చిన్నదైనా ఏదో ఒక పని చేయాల్సిన స్థితి అనివార్యమౌతున్నది. అతి కొద్దిమంది మాత్రమే నిలకడైన ఉద్యోగాలు, తగిన ఆదాయం పొందగలుగుతున్నారు. మెజారిటీ మహిళలు ఇంటా, బయటా చాకిరీతో చాలీచాలని ఆదాయంతో నలిగిపోతున్నారు. ప్రభుత్వ రంగంలో ఉద్యోగభర్తీ లేదు. చదువుకున్న అమ్మాయిలు కూడా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా తక్కువ వేతనాలతో పని చేస్తున్నారు. ప్రయివేటు యాజమాన్యాల దోపిడీకి భిన్నంగా ఉండవలసిన ప్రభుత్వం స్కీం వర్కర్ల పేరుతో ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన తదితరులపై అదనపు పనిభారం మోపుతూ,

ఉద్యోగ భద్రత లేకుండా తక్కువ వేతనాల్తో దోపిడీ చేస్తున్నది. టెక్స్‌టైల్స్, గార్మెంట్స్, అగర్‌బత్తి వగైరా పరిశ్రమల్లోనూ, బీడీ, లేసు తదితర గృహ పరిశ్రమ కార్మికులుగాను, రొయ్యలు, చేపలు ప్రాసెసింగ్ పరిశ్రమల్లో అనారోగ్యకర వాతావరణంలో పనిచేస్తూ విపరీతమైన శ్రమ దోపిడీకి గురవుతున్నారు. యునిసెఫ్ లెక్కల ప్రకారమే రెండువంతుల పని మహిళలు చేస్తున్నప్పటికీ, ఐదవ వంతు (20 పైసలు) ఆదాయాన్ని కూడా పొందలేకపోతున్నారు. హీనమైన వేతనాలతో, ఆర్థిక సమానత అందని ద్రాక్షగా మారింది. ఇళ్ళల్లో పాచిపని చేసే మహిళల్ని ప్రభుత్వం

కార్మికులుగా గుర్తించి పని, వేతనాలు, సెలవులు నిర్ణయించాలి. కానీ పాచిపనిని గుర్తించడం కానీ, వారిపేర్లు నమోదు చేయడం గాని, యజమానుల వేధింపుల నుండి రక్షణ కల్పించడం లేదు. గ్రామాలలో పని దొరకక పట్టణాలకు వస్తున్న వారికి దొరికేది పాచి పనులు మాత్రమే. ఏపని దొరకకపోవడంతో తిరుపతిలో క్షౌరవృత్తిలో రిజర్వేషన్ కోసం పోరాడి సాధించుకొన్నారు. అక్కడ కూడా వారు అతి హీనమైన వేతనాలనే ( నెలకు 2000 నుండి 3000) పొందుతున్నారు. మరుగుదొడ్లు శుభ్రం చేసే పనులకు కూడా పోటీపెరిగి పార్ట్‌టైమ్ పని మాత్రమే దొరుకుతుంది. ఇదీ నేటి మహిళా ఉపాధి వేతానాల్లో వివక్షత.

## ప్రజా పంపిణీ తీరు

అంతర్జాతీయ ఆకలి సూచీ ప్రకారం 199 దేశాలలో భారత దేశం 94వ స్థానంలో ఉంది. నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరుగుతున్నాయి. టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ప్రభుత్వం ఇచ్చిన తొమ్మిది రకాల వస్తువులను ప్రభుత్వం అటకెక్కించింది. రైల్వేచార్జీల పెంపుదల, పెట్రో, డీజిల్ ధరలపై నియంత్రణ ఎత్తివేయడం నిత్యావసర వస్తువుల ఫ్యూచర్ ట్రేడింగ్ తదితర కారణాలతో ధరలు భారీగా పెరుగుతున్నాయి. 2008లో రూ. 22 ఉన్న కిలో బియ్యం ధర నేడు 50 రూపాయలు. అప్పట్లో లీటరు పాలు 20 ఇప్పుడు 50 రూపాయలు. నూనె ధర 80 నుండి 110కి చేరింది. పప్పులు, ఉప్పుతోపాటు కూరగాయలు ఇతర నిత్యావసర ధరలదీ ఇదే బాట! ధరలను తగ్గించడానికి బదులుగా మోడీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన శాంతకుమార్ కమిటీ సిఫార్సులు ప్రజాపంపిణీ వ్యవస్థకు మరణ శాసనాన్ని లిఖించాయి. ప్రభుత్వం వ్యవసాయోత్పత్తులను రైతుల వద్ద ఎఫ్‌సిఐ ద్వారా కొనుగోలు చేయడాన్ని తగ్గించి ప్రభుత్వ సేకరణను నిర్వీర్యం చేయనుంది. ధరలు పెరిగినప్పుడు ప్రభుత్వం జోక్యం చేసుకొని ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా వస్తువులను సరఫరా చేయడానికి అనువుగా నిత్యావసరాలను సేకరించడంలేదు. ప్రయివేటు వ్యాపారుల దయాదాక్షిణ్యాలకు ప్రజల్ని బలిచేస్తున్నది. ఫ్యూచర్ ట్రేడింగ్ వ్యాపారస్థులకు లాభాలు చేకూరుస్తుంది. గతంలో ఇచ్చిన 9రకాల నిత్యావసరాలను ఎత్తివేసింది. జాతీయ ఆహార భద్రత చట్టం మేరకు ప్రతి కుటుంబానికి 35 కేజీల ఆహార ధాన్యాన్ని అందించాలి. కానీ తలకు 1 కేజీ మాత్రమే ఇస్తున్నది. 69శాతం

మందికి మాత్రమే తెల్ల రేషన్‌కార్డులు ఉండాలనే కేంద్ర ప్రభుత్వ ఆదేశానుసారం రేషన్ కార్డులు తగ్గించడం, కొత్త కార్డులు ఇవ్వడానికి ఆంక్షల్తో ప్రజా పంపిణీకి ప్రజల్ని దూరం చేస్తున్నది. నగదు బదిలీకి సన్నాహాలు చేస్తుంది. 2009 -10 ఎన్‌ఎస్‌ఎస్ లెక్కల ప్రకారం పట్టణాలలో 70%, గ్రామాల్లో 76% ప్రజలు అవసరమైన ఆహారాన్ని తీసుకోలేకపోతున్నారు. మరోవైపు రాష్ట్రంలో ఇ-పాస్ విధానాన్ని అమలుచేయడం ద్వారా లక్షల మంది రేషన్ కోల్పోతున్నారు. తూర్పు గోదావరి జిల్లాలో 100 షాపుల్లో నెలకు 10వేలమంది కార్డుదారులు రేషన్ తీసుకోలేకపోయారు. ఇ-పాస్ పద్ధతిలో 974కోట్లు సబ్సిడీ తగ్గించుకోవచ్చుననేది ప్రభుత్వ ఎత్తుగడ. సార్వజనీన ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యావసర వస్తువులను ప్రభుత్వమే నేరుగా సరఫరా చేస్తేనే ప్రజలకు పోషకాహారం దొరుకుతుంది. పోషకాహారం లోపానికి మొదట బలయ్యేది మహిళే. మహిళోద్ధరణ గురించే నీతులు చెప్పే పాలకులు ప్రజా పంపిణీ వ్యవస్థని పటిష్ట పరుస్తారా?

## మహిళలు - బడ్జెట్ కేటాయింపులు

మహిళల సమానతను సాధించేదానిలో కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లు చాలా కీలక పాత్ర నిర్వహిస్తాయని బీజింగ్ ప్రపంచ మహిళా సదస్సు మరియు యునెస్కోలు తీర్మానించాయి. సామాజిక వివక్షతకు, ఆర్థిక అసమానతకు గురవుతున్న మహిళలు సమాన అవకాశాలు పొందేందుకు జండర్ బడ్జెట్‌ను రూపొందించాలని నిర్ణయించాయి. ఆమేరకు భారత ప్రభుత్వం సంతకం చేసినా ఆచరణలో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు జండర్ బడ్జెట్‌ను రూపొందించడంలో వైఫల్యం చెందాయి. 75% మంది మహిళలు పేదరికంలో మగ్గుతున్నారని అనేక సర్వేలు చెప్పాయి. గత నెలలో విడుదలైన సామాజిక, ఆర్థిక సర్వే 92% మంది ప్రజలు కనీస ఆదాయం పొందలేని స్థితిలో వున్నారని వెల్లడించింది.

జస్టిస్ వర్మ కమీషన్ హింసను అరికట్టేందుకు దానిని బహుముఖంగా ఎదుర్కోవాలని సూచించింది. సున్నితత్వంతో కూడిన, స్పందించ గలిగిన పోలీసు యంత్రాంగాన్ని రూపొందించాలని, వారికి అందుకవసరమైన శిక్షణ ఇవ్వాలని, మహిళలు పనిచేసే చోట భద్రత కల్పించాలని, చౌకగా సురక్షిత ప్రయాణ సాధనాలు ఏర్పాటు చేయాలని, అత్యాచార

బాధితులకు సత్వర ఆర్థిక సహాయం, ఆశ్రయం కల్పించే వసతి కేంద్రాలు, చట్టాలను సక్రమంగా అమలు చేయటం, కేసులను సత్వరం పరిష్కరించటం వంటి అనేక చర్యలను వర్మ కమిషన్ సూచించింది. వీటిని అమలు చేయాలంటే ఆర్థిక వనరులు అవసరం.

కానీ మొత్తం కేంద్ర బడ్జెట్‌లో మహిళల కోసం కేటాయించినది 0.02% మాత్రమే. నిర్భయ ఉదంతం తరువాత బాధిత మహిళలకు అన్ని సేవలూ ఒకచోటే అందించాలని చేసిన సూచన మేరకు " వన్‌స్టాప్ క్రైసిస్ సెంటర్లు" ఏర్పాటయ్యాయి. కానీ ప్రస్తుతం మోడీ ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులు చేయకపోవడంతో ఈ కేంద్రాలు మూతపడ్డాయి. గృహ హింస చట్టం అమలుకు నయాపైసా కూడా కేటాయించలేదు. పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక చట్టం, లైంగిక వేధింపుల నుండి బాలల సంరక్షణ చట్టం, వరకట్న నిషేద చట్టం తదితర చట్టాల అమలుకు యంత్రాంగాన్ని ఏర్పాటు చేయలేదు. అందుకు బడ్జెట్ కేటాయింపులు లేవు. యాసిడ్ దాడులకు గురయిన మహిళలకు సంక్షేమ నిధిని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కానీ బడ్జెట్‌లో దాని ఊసే లేదు.

పేదరికంలో ఉన్న ప్రజల్ని ముఖ్యంగా మహిళల్ని ఆదుకోవడానికి బడ్జెట్ కేటాయింపులు వాటిని ఖర్చుచేయడం కీలకపాత్ర వహిస్తుంది. కానీ మోడీ ప్రభుత్వం బడ్జెట్‌లో సంక్షేమానికి తీవ్ర కోత విధించింది. గతంలో మహిళా పథకాలకు రూ. 1లక్ష కోట్లు కేటాయిస్తే ఈ సారి రూ. 79,259కోట్లు కేటాయించారు. మహిళా, శిశు సంక్షేమానికి రూ. 21,193 కోట్లు నుండి రూ. 10,382 కోట్లకు కుదించింది. అంగన్‌వాడీ తదితర కేంద్రాలకు ఐ.సి.డి.యస్. ద్వారా ఇచ్చే నిధుల్ని రూ. 18,391కోట్లు నుండి రూ. 8,754కోట్లు, సబల పథకానికి రూ. 700 కోట్లు నుండి 10 కోట్లకు తగ్గించింది. ఇదీ ఆచరణలో మోడీగారి "బేటి బచావో – బేటీ పడావో" (కూతుర్ని రక్షించండి – కూతుర్ని చదివించండి) తీరు.

మహిళల అభివృద్ధికి సంబంధించి వివిధ పథకాలపై ఇలా ప్రత్యక్షంగా కోతలు విధించిన ప్రభుత్వం పరోక్షంగా కూడా భారీగా నిధులు తగ్గించింది. కేంద్రం నుండి రాష్ట్రాలకు వచ్చే వాటా రూ. 3,29,712 కోట్ల నుండి రూ. 1,95,778 కోట్లకు తగ్గిపోయింది. రాష్ట్రాలు అమలు చేసే పలు పథకాలపై దీని ప్రభావం పడనుంది. సాంఘిక సంక్షేమ బడ్జెట్ గతం కంటె 140

లక్షల కోట్ల రూపాయలు తగ్గించింది. ఆరోగ్య రంగంలో 6వేల కోట్లు , మధ్యాహ్న భోజన పథకంలో రూ. 5,440 కోట్లు, సర్వశిక్షా అభియాన్‌లో 9వేల కోట్లు, భారీగా ప్రచారం చేస్తున్న స్వచ్ఛభారత్ కార్యక్రమానికి రూ. 5,764 కోట్లు తగ్గించింది. గ్రామీణాభివృద్ధికి 10 వేల కోట్లు కోత పెట్టడం ఎస్.సి., ఎస్‌టి సబ్ ప్లాన్‌లో 20 వేల కోట్లు తగ్గించడం కూడా మహిళల అభివృద్ధి, సంక్షేమ పథకాలపై తీవ్ర ప్రభావం చూపనుంది. ఆహార సబ్సిడీ అవసరాలు పెరిగినా కేటాయింపులు పెరగలేదు. ఇవి కాక అనేక స్కీములు రద్దుచేశారు. మహిళలకు వ్యవసాయంలేని రోజుల్లో కొద్ది రోజులపాటైనా ఉపాధి కల్పిస్తున్న 'రేగా'చట్టంలో కేంద్రం 12 వేల కోట్లు కోత విధించింది. నిర్భయ నిధి కింద 3 వేల కోట్లు కేటాయించినప్పటికి దాన్ని ఉపయోగించుకోవడానికి అవసరమైన నిబంధనలు రూపొందించలేదు. వివిధ రంగాలలో బడ్జెట్‌ను తగ్గించటం ద్వారా మహిళపై మరింత భారం మోపడానికి ఈ బడ్జెట్ కారణమవుతుంది.

**రాష్ట్రంలో ఇలా ...!**

కేంద్ర ప్రభుత్వం బాటలోనే రాష్ట్ర ప్రభుత్వమూ నడుస్తోంది. రాష్ట్రంలో 'అన్నా కేంటిన్' లు పెట్టి తక్కువ ఖర్చుతో భోజనం ఏర్పాటు చేస్తామని ప్రకటించినా దానికి బడ్జెట్ కేటాయింపులు లేవు. ఆహార భద్రతా చట్టం అమలుకు కనీసం 3,631 కోట్లు అవసరం. కానీ కేటాయించింది 2,318 కోట్లు మాత్రమే. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్‌కు కోత పెట్టారు. బడ్జెట్ కేటాయింపులను ఖర్చు చేసేటపుడు మరింత కోత విధిస్తున్నారు.

92% మహిళలు అసంఘటిత రంగంలో పనిచేస్తున్నారు. వారి సంక్షేమానికి కేటాయింపులు లేవు. పంచాయతీరాజ్ వ్యవస్థలో 50% రిజర్వేషన్‌లు మహిళలకు కల్పించారు. కానీ ఎన్నికైన మహిళా ప్రతినిధులు తమ పనులు నిర్వహించేందుకు అవసరమైన శిక్షణ, ప్రయాణ ఖర్చులు, సమావేశాలకు హాజరైనందుకు అలవెన్సులు, గౌరవ వేతనాలు తదితర కేటాయింపులు లేవు. పురుషుల మీద ఆధారపడకుండా వ్యవహరించాల్సిన మహిళా నేతలు ప్రభుత్వ వైఖరి వలన స్వతంత్రంగా వ్యవహరించే అవకాశం కోల్పోతున్నారు. అసమాన స్థితి నుండి సమాన స్థితిని అందుకోవడానికి తగిన ప్రణాళికలు, బడ్జెట్ లేకపోతే మహిళోద్ధరణ, సాధికారత సాధ్యమేనా?

## డ్వాక్రా గ్రూపులు – ఋణమాఫీ

మహిళా సాధికారతకు చిహ్నంగా చూపెడుతున్న స్వయం సహాయక సంఘాలు సమస్యల వలయంలో ఉన్నాయి. మన రాష్ట్రంలో 6,57,538 గ్రూపులు ఉన్నాయి. 69,84,569 మంది సభ్యులు వున్నారు. సభ్యుల బకాయి మొత్తం 14,699 కోట్లు . ఎన్నికల సమయంలో రుణమాఫీ ప్రకటనతో గ్రూపులన్నీ కిస్తీలు కట్టటం మానేశాయి. దాంతో అన్ని గ్రూపులు పెనాల్టీతో కిస్తీలు చెల్లించవలసి వచ్చింది. ప్రయివేటు వ్యాపారులనుండి అదనపు వడ్డీలు కూడా తెచ్చి పొదుపు గ్రూపుల అప్పులు తీర్చటం మొదలు పెట్టారు. ఇప్పటికీ గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో నిరుపేదలుగా ఉన్న కొన్ని ఎస్సి, ఎస్టి గ్రూపులు తిరిగి చెల్లించలేకపోయారు.

ప్రభుత్వం గ్రూపునకు లక్ష రూపాయలు మాత్రమే మాఫీ చేస్తామని సంపూర్ణ రుణమాఫీ హామీ నుండి వెనకడుగు వేసింది. ఇప్పుడు మొదటి విడత మనిషికి 3వేలు మాత్రమే జమ చేస్తామని, అదికూడా పెట్టుబడి ఖాతాలో మాత్రమేనని రుణమాఫీ కాదని పిల్లి మొగ్గ వేసింది. డ్వాక్రా మహిళల రుణమాఫీ ఇట్లా కథ కంచికి చేరుస్తున్నది. ఆధార్ లింకు పెట్టినందువలన అనేక గ్రూపులు ప్రభుత్వం ఇస్తున్న ఆ కొద్దిపాటి మొత్తాన్ని కూడా పొందలేకపోతున్నాయి. ఉదా:- గుంటూరులోని హనుమయ్య నగర్‌లో ఒక సమాఖ్యలోని 16 గ్రూపులకు గాను 8 గ్రూపులకు అసలు ఆధార్ అనుసంధానమే అవలేదు. ఆధార్ అనుసంధానమైన 8 గ్రూపులలోని 80 మంది సభ్యులకుగాను 52 మంది మాత్రమే ఆధార్ లింక్ పొందగలిగారు.

రాష్ట్ర ప్రభుత్వం 3వేల రూపాయల చొప్పున జమ చేసేందుకు ప్రభుత్వం గత జూన్ 2వ తేదీన 2,660 కోట్లు విడుదల చేసినట్లు ప్రకటించింది. అది ఇంకా గ్రూపులకు చేరలేదు. 2014 ఫిబ్రవరి నుండి అయినా వడ్డీ కింద 1310 కోట్లు విడుదల చేస్తామని చెప్పారు. కానీ ఇంకా విడుదల కాలేదు. డ్వాక్రా గ్రూపులకు సంబందించి నెలవారీ కిస్తీలను గతంలో క్రమబద్ధంగా చెల్లిస్తున్నందున బ్యాంకులలో ఎన్‌పిఏ 2.8 % ఉండేది. గత సంవత్సర కాలంగా డ్వాక్రా చెల్లింపులు ఆగిపోగా ఎన్‌పిఏ 8 శాతానికి పెరిగింది.

అమలు చేయలేని వాగ్దానాలు ఎవరిమ్మన్నారని మహిళలు ప్రశ్నిస్తున్నారు. రుణమాఫీ హామీతో గ్రూపులు డిఫాల్ట్ అయినందున వడ్డీ రాయితీ కోల్పోయారు. ఇది సుమారుగా 2 వేల

కోట్ల రూపాయలు. అభయహస్తం పథకం కింద 27 కోట్ల రూపాయలు డ్వాక్రా మహిళలు ప్రభుత్వానికి చెల్లించారు. 60 సంవత్సరాలు నిండిన వారికి నెలకు 500 రూపాయలు అభయహస్తం పెన్షన్ అందచేస్తామన్నారు. ఇపుడు డబ్బులు చెల్లించిన డ్వాక్రా మహిళలకు చెల్లించవలసిన 500రూ॥లకు ప్రభుత్వం సమాధానం చెప్పాల్సి వుంది. విలేజీ ఆర్గనైజర్స్, యానిమేటర్స్‌కు ప్రభుత్వం జీతాలు చెల్లించనందున డ్వాక్రా గ్రూపు మహిళలు గ్రూపు పరిధిలో జరిగే లావాదేవీలలో కమిషన్‌లు ఇవ్వవలసి వస్తోంది. డ్వాక్రా బజార్లు పెట్టి మహిళలు తయారుచేసే వస్తువులకు అమ్మకాలు పెంచుతామని, పారిశ్రామికవేత్తలుగా మారుస్తామని చేసిన వాగ్ధానాలు కాగితాలకే పరిమితమయ్యాయి. జనశ్రీ భీమాయోజన తదితర ఇన్సూరెన్సు స్కీములలో డబ్బులు కట్టించుకుంటున్నారు. కానీ పిల్లల స్కాలర్‌షిప్‌లు అందరికీ అందలేదు. చనిపోయినప్పుడు కూడా కొద్దిమందికి మాత్రమే భీమా డబ్బులు అందుతున్నాయి. లోన్లు ఇచ్చినప్పుడు బ్యాంకువారు డిపాజిట్లు బలవంతంగా కట్టించుకుంటున్నారు. కొన్నిచోట్ల ఇన్సూరెన్సు పాలసీలు కూడా చేయించుతున్నారు. పొదుపు చేసుకుంటున్న డబ్బులు గ్రూపు అవసరాలకు డ్రా చేయకుండా ఆంక్షలు విధిస్తున్నారు. అవినీతి మూలంగా నిరక్షరాస్యులైన పొదుపు మహిళలు నష్టపోతున్నారు. విద్యార్థినులకు సైకిళ్ళు ఇస్తామని, మహిళల రక్షణ కొరకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేస్తామని, ప్రతి పోలీస్ స్టేషన్‌లో మహిళా అధికారిని నియామకం చేస్తామని, ధరలు తగ్గుదలకు చర్యలు తీసుకుంటామని, చౌకగా మంచినీళ్ళు అందిస్తామని, అంగన్‌వాడీ కార్యకర్తలకు జీతాలు పెంచుతామని మరింకెన్నో వాగ్ధానాలు భారీగా చేసింది. బడ్జెట్ కేటాయింపులు మాత్రం లేవు. ఆచరణలో ఇవేవి అమలు జరపడంలేదు. బాబు మార్కు మహిళోద్ధరణ అంటే ఇదే!

**అవినీతి**: 2014వ సం॥లో తిరుపతిలో ఐద్వా నిర్వహించిన సర్వేలో అవినీతి కథలు వెలుగులోకి వచ్చాయి. తిరుపతిలోని టిఎమ్‌సి కాలనీలో వున్న 15 ఎస్‌టి (యానాది) డ్వాక్రా గ్రూపుల డబ్బు 27 లక్షలు రాధా అనే ఆర్‌పి స్వాహా చేసింది. ఇలాంటివే మరికొన్ని కాలనీల్లో కూడా వెలుగులోకి వచ్చాయి. సాక్షాత్తు ముఖ్యమంత్రి గారి ఇలాక కుప్పంలో ఒక బ్యాంకు మేనేజర్ 13 గ్రామాల్లోని సభ్యుల పేర్లతో 57 లక్షల రూపాయలు డ్రా చేసి దిగమింగాడు. ఈ అవినీతికి ఐకెపి, మెప్మా అధికారుల తోడ్పాటు వుంది. దీనిపై చర్యలేవి?

**స్వయం సహాయం ఎక్కడ? :** ప్రతి స్వయం సహాయక గ్రూపు రిజిష్టరు కాబడింది. ఇవి స్వయం సహాయ సంఘాలుగా వారి నిర్ణయాలు వారు తీసుకుని పనిచేయాలని చట్టంలో పేర్కొనబడింది. ప్రభుత్వ అధికారులు వారికి సహాయకారులుగా మాత్రమే ఉండాలి. కానీ సమాఖ్య ఎన్నికల నుండి ప్రతి కార్యక్రమము అధికారుల కనుసన్నలలోనూ, అధికారి పార్టీ ప్రయోజనాల మేరకే జరుగుతున్నాయి. రాష్ట్రంలో ఇసుక క్వారీలను డ్వాక్రా మహిళలకు అప్పజెబుతూ జివొ జారీ చేసింది. క్వారీలలో వచ్చే ఆదాయంలో 25శాతం ఆదాయాన్ని ఆ గ్రామంలో డ్వాక్రా మహిళలకు చెల్లించాలి. కానీ వారికి చెల్లించాల్సిన బకాయిలు చెల్లించకపోగా అడిగిన వారిపై అధికార ఇసుక మాఫియా దాడులు చేస్తుంది. డ్వాక్రా గ్రూపుల మాటున టిడిపి నేతలే క్వారీలను నడిపిస్తున్నారన్నది నగ్న సత్యం.

## మద్యాన్ని నియంత్రించాలి

మహిళల కన్నీరు తూడుస్తా, బెల్టుషాపులను రద్దు చేస్తానన్నాడు చంద్రబాబు. కానీ మందు బాబులకు ఏ కొరతా రానివ్వకుండా షాపింగ్ మాల్స్‌లో సైతం అమ్మకాలకు అనుమతిచ్చాడు. టెట్రా పాక్‌ల ద్వారా సులభంగా అన్ని చోట్లా అందేలా మందుగాళ్ళకు అవకాశం ఇచ్చారు. మిని డిస్టిలరీల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతించింది. గత సంవత్సరం 11,488కోట్ల రూపాయల ఆదాయం రాగా ఈ సంవత్సరం 15వేల కోట్ల ఆదాయం కోసం ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. అధికారికంగా గత సంవత్సరం 4,380షాపులకు లైసెన్స్‌లిచ్చానా 3,029 షాపులు మాత్రమే నడిచాయి. ఈ సంవత్సరం గతంలో ఇచ్చిన అన్ని షాపులకూ లైసెన్సులిస్తూ అదనంగా షాపింగ్ మాల్స్‌లో కూడా అనుమతిని మంజూరు చేయడం ప్రభుత్వ నిజస్వరూపానికి అద్దం పడుతుంది. ఖజానా నింపుకునే ధ్యాస తప్ప ప్రజల ఆరోగ్యం, సామాజిక, నైతిక రుగ్మతలు ప్రభుత్వానికి పట్టలేదు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం 32%మంది పురుషులు మద్యానికి బానిసలయ్యారు. 1980నాటికి తాగుడు ప్రారంభించేవారి వయస్సు 28 ఏళ్ళు కాగా ఇప్పుడది పాలకుల పుణ్యమా అని 18ఏళ్ళకు తగ్గింది. మద్యం ఆదాయంలో 65%వాటా నిరుపేద కుటుంబాలవారిదే. మహిళలపై నిత్యం జరుగుతున్న గృహ

హింస, వరకట్న హత్యలు, లైంగిక నేరాలు యాక్సిడెంట్‌లకు ఒక ముఖ్యమైన కారణం మద్యపానమే. పేదల కూలి డబ్బులు మందుకొట్లకు చేరుతున్నాయి. మహిళల కష్టంతోనే పిల్లల చదువులు, కుటుంబాలు నడుస్తున్నాయి. కృష్ణాజిల్లా షేర్‌మహ్మద్‌పేటలో 200మందికి పైగా మహిళలు ముప్పై సంవత్సరాల వయసు లోపలే వితంతువులయ్యారు. “రూపాయి బియ్యం అవసరంలేదు. మద్యం లేకుండా చెయ్యండి” అని మహిళలు వేడుకుంటున్నారు.

మద్య నియంత్రణ చట్టం ప్రకారం మద్యపానంవల్ల జరిగే నష్టాలపై విస్తృత ప్రచారం చేస్తామన్న ప్రభుత్వం అందుకోసం కేటాయించిన డబ్బును మాత్రం ఉపయోగించడం లేదు. జిల్లాకొక ‘డి’ఎడిక్షన్ కేంద్రం పెట్టాలని కూడా చట్టంలో ఉంది. అది కూడా ఆచరణకు నోచుకోవడంలేదు. గతంలో మద్య నిషేదానికి ముందు ఆంధ్ర రాష్ట్రంలో వారానికి ఒకరోజు ‘డ్రై’డే (మందు లేని రోజు)అమలయ్యేది. అలాగే షాపుల నిర్వహణకు కూడా అనేక నిబంధనలుండేవి. బడి, గుడి, జనం రద్దీ ఉన్నచోట, హైవేల ప్రక్కన షాపులు పెట్టరాదని, నియమిత వేళలు పాటించాలనుండేది. ఈ నియమాలను ఏ ఒక్కటీ పాటించడంలేదు. పైగా ప్రభుత్వం ఎక్సైజ్ అధికారులకు అమ్మకాలకు టార్గెట్స్ విధించి నిబంధనలకు విరుద్దంగానైనా అమ్మమని ప్రోత్సహిస్తుంది. వారిచేతనే అమ్మిస్తున్నది. ప్రజల ఆరోగ్యం మీద, కుటుంబ పీడనతో ప్రభుత్వమూ, మద్యం వ్యాపారులు, మద్యం ఉత్పత్తిదారులు పొందుతున్న వేలకోట్ల రూపాయలు సామాన్యుల రెక్కల కష్టమే. మద్యాన్ని ఒక ప్రధాన ఆదాయ వనరుగా చూస్తున్న ప్రభుత్వం ప్రజా వ్యతిరేక ప్రభుత్వం అవుతుందేగానీ ప్రజా క్షేమం కోరే ప్రభుత్వం కాదు. మద్యాన్ని నియంత్రించగలిగేది ప్రజా ఒత్తిడి మినహా మరో మార్గం లేదు. అనేక చోట్ల మహిళలు తమంత తామే ఉద్యమించి షాపులు పెట్టడాన్ని నిరోధిస్తున్నారు. ప్రభుత్వం మద్య వ్యతిరేక ప్రచారానికి పూనుకొనేలా ఉద్యమించాలి. చట్టంలోని నిబంధనలను ఖచ్చితంగా ప్రభుత్వం అమలు చేయాలి. క్రమంగా మద్యాన్ని నియంత్రించాలని ప్రజలు పోరాడాలి.

## స్త్రీలపై హింస

బలవంతుడు, రక్షకుడు, సంపాదనపరుడు, తెలివైనవాడు, విశాలహృదయుడు, ఉత్తముడు, పున్నామనరకం నుండి తప్పించేవాడు పురుషుడే అన్న విశ్వాసం సమాజంలో

పాతుకుపోయింది. స్త్రీలు పురుషుల కోసమే సృష్టింపబడ్డారని, మత ధర్మాల పేరుతో సమాజాన్ని నమ్మించారు. మేలి ముసుగుల్లో, బురఖాల్లో స్త్రీని దాచే ప్రయత్నం ఇప్పటికీ సాగుతూనే ఉంది. అనాదిగా సాగిన ఈ దురాచారాలను సంస్కరణోద్యమం, స్వాతంత్ర ఉద్యమం సవాల్ చేసింది. స్త్రీలకు కూడా విద్య అవసరమని, సామాజిక కార్యక్రమాల్లో భాగస్వామి కావాలని, బాల్య వివాహాలు తగవని, సమాన ఆస్థిహక్కు చట్టాలు కావాలని ఎన్నో ఉద్యమాలు సాగాయి. ఫలితంగా భారత రాజ్యాంగం సమానహక్కులు కల్పించింది. సమానత సాధనకు అవసరమైన అనేక చట్టాలు రూపొందాయి. కానీ, నేడు స్వాతంత్రోద్యమ సంప్రదాయాలు వెనుకపట్టు పట్టాయి. గత కాలపు మూఢ విశ్వాసాలే ప్రశ్నించరానివిగా మళ్లీ ముందుకు వచ్చాయి. బిజెపి.ఆర్ఎస్ఎస్ శక్తులు అధికారంలోకి రావడంతో మహిళలకు ప్రమాదం ముంచుకొచ్చింది.

ఇంట్లో ఆడవాళ్లపై పెత్తనం, ఆడపిల్లలపై వివక్ష, ఆస్తులకు మగపిల్లలే వారసులు కావడం, కట్నాలకు హక్కుదారులు కావడం తదితర ఆధిపత్య భావజాలం, వివక్షా పూరిత విశ్వాసాలు ఆచరణలో యాసిడ్ దాడులకు, అత్యాచారాలకు పునాదులవుతున్నాయి. మహిళలపై నేరాల్లో దేశంలో ఆంధ్రప్రదేశ్ రెండవ స్థానంలో ఉంది. నేర పరిశోధనా విభాగం లెక్కల ప్రకారం 98 శాతం మహిళలపై అఘాయిత్యాలు తెలిసిన వారే పాల్పడుతున్నారు. 2012లో దేశంలో నమోదైన మొత్తం కేసులు, 2,44,290 ఆంధ్రప్రదేశ్‌లో నమోదైన కేసులు, 36,622 (12.6శాతం) దేశంలోనే అత్యధిక క్రైమ్‌రేట్ ఉన్న నగరం విజయవాడ. సైబర్ నేరాలు 2013 : 306, 2014 : 410.

మన రాష్ట్రంలో ముసునూరు తహసీల్దార్ వనజాక్షిని జుట్టుపట్టి ఈడ్చించిన ఇసుక మాఫియా నేత, తెలుగుదేశం శాసనసభ సభ్యుడు చింతమనేని ప్రభాకర్. ఏలూరులో పసిపాపపై అత్యాచారం, హత్య. విజయవాడలో మైనర్ బాలికను నమ్మించి గ్యాంగ్‌రేప్ చేసిన యువకులు. హైదరాబాదులో అక్కాచెల్లెళ్ళను హతమార్చిన ప్రేమోన్మాది. రంగారెడ్డిలో కన్నకూతురుపైనే అత్యాచారం. తిరుపతిలో విడాకులు తీసుకొని బ్రతుకుతున్న లెక్చరర్‌పై మాజీభర్త యాసిడ్ దాడి. గ్యాంగ్‌రేప్ నిందితులను శిక్షించాలని కోరిన సునీతాకృష్ణన్ పై దాడికి దిగిన వైనం. ఇలా అడుగడుగునా ప్రతి గంట, ప్రతి రోజూ ఏదో మూల మహిళలపై హింస, అత్యాచారాలు.

బాలికలపై లైంగిక దాడుల్లో 336 శాతం పెరిగాయి. ఢిల్లీలో ప్రతిరోజు అపహరణకు గురవుతున్న 10 మంది మహిళలు. 5గురిపై అత్యాచారం. దేశంలో ప్రతి పావుగంటకూ ఒక మహిళ వేధింపులకు బలవుతోంది. ప్రతిరోజు 92 మందిపై అత్యాచారాలు నమోదవుతున్నాయి.

ఈ నేరాలు చేస్తున్న వారిలో ప్రజాప్రతినిధుల సంఖ్య కూడా గణనీయంగా ఉంది. అత్యాచార బాధితుల తరపున అండగా నిలబడి పోరాడుతున్న సునీతా కృష్ణన్ వాస్తవంగా జరుగుతున్న 20 ఘటనల్లో ఒకటి మాత్రమే నమోదవుతున్నాయని చెప్పారు.

ఈ పరిస్థితి నుండి బయటపడేందుకు మహిళా చట్టాలను పటిష్టంగా అమలు చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పూనుకోవాలి. స్త్రీలపై జరుగుతున్న నేరాలను త్వరగా విచారించేందుకు తగు ఏర్పాట్లు చేయాలి. బాధిత మహిళలను అన్నివిధాలా ఆదుకొని గౌరవంగా బ్రతికే అవకాశాలు కల్పించాలి. పనిచేసేచోట భద్రత కల్పించాలి. పాఠ్యాంశాలలో స్రీ, పురుష సమానతను పెంచే అంశాలను పొందుపరచాలి. స్త్రీలను అవమానించే అశ్లీల, అసభ్య చిత్రాలను, సంస్కృతిని అడ్డుకోవాలి. కార్యాలయాల్లో, పని ప్రదేశాల్లో స్త్రీలకు ఇబ్బందిపరిచే, కించపరిచే వాతావరణాన్ని, పద్ధతులను మార్చాలి. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు లైంగిక వేధింపుల వ్యతిరేక కమిటీలను అన్నిచోట్ల ఏర్పాటు చేయాలి. కుటుంబంలోను, సమాజంలోను ప్రజాస్వామిక సంబంధాలను పెంపొందించాలి. స్త్రీలు సామాజిక ఉత్పత్తిలో సంపూర్ణ భాగస్వాములయ్యేందుకు కావల్సిన అన్ని చర్యలను ప్రభుత్వాలు చేపట్టాలని డిమాండ్ చేయాలి.

సహస్రాబ్ధాలుగా జీతం అవసరం లేని జీవితకాలపు కట్టుబానిసలా, వారసులను కనిచ్చే యంత్రంలా పడివున్న స్త్రీ ఆధునిక సమాజం అందించిన అవకాశాలను ఉపయోగించుకుని సూటిగా తలెత్తి చూడటం ప్రారంభమైంది. చదువులే వద్దన్న స్థితి నుండి పోటీ పరీక్షల్లో ఆడపిల్లలు ముందంజలో ఉండటం చూస్తున్నాం. మగవాళ్ళకే ప్రత్యేకమనుకునే అన్ని రంగాల్లోనూ (రైళ్ళు, విమాన చోదకులుగా కూడా) మహిళలు రాణించుతున్నారు. ఆత్మవిశ్వాసంతో అడుగులు వేయడాన్ని, సాధిస్తున్న విజయాలను ఆహ్వానించాలి.

స్త్రీలపై ఇంటా, బయటా జరుగుతున్న హింసను అరికట్టేందుకు మూలాలపై పోరాడాలి. నేడు పాలక వర్గాలుగా మారిన మితవాద శక్తుల సైద్ధాంతిక అవగాహనను, దానితో వస్తున్న

ఆచరణను తిప్పికొట్టాలి. దానికి సమాజం మేలుకోరే పురుషులు, స్త్రీలు సంయుక్తంగా దీనిపై పోరాడాలి.

## మహిళలపై బిజెపి దాడి

'మహిళలు పదిమంది పిల్లల్ని కనాలి' ...అంటూ సాధ్వి సాచి చెప్పిన మాటలను బిజెపి ఎంపి సాక్షి మహారాజ్ నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వరకు అందిపుచ్చుకున్నారు. ఆడపిల్లల వస్త్రధారణే అత్యాచారాలకు కారణమని ఈ రాష్ట్ర డిజిపినుండి బిజెపి అగ్రనేతల వరకు తప్పుడు కూతలు కూస్తున్నారు. ఆడపిల్లలు బయటకు రావడం వల్లే అత్యాచారాలనీ, సాయంత్రం ఆరు గంటల తరువాత బయటకొచ్చే ఆడపిల్లలందరూ చెడిపోయిన వారేనన్న పల్లవిని నిర్భయ కేసు నిందితుల నుండి కాంగ్రెస్, బిజెపి తదితర నాయకులు అందుకున్నారు. సాయంత్రం 7 గంటల తరువాత మర్యాదలేని మహిళలే బయటకు వస్తారని ఒక సుప్రీంకోర్టు న్యాయవాది మాట్లాడారు. మగ పిల్లలతో కలిసి బయటకు రావడం మరింత నేరమని పేలుతున్నారు. కుల,మతాల అంతరాలను అధిగమించి వివాహాలు చేసుకున్న యువతీయువకులను కుల పంచాయతీలు నిర్వహించి హత్యలు చేస్తున్నా నిస్సిగ్గుగా బలపరుస్తున్నారు. సిపిఎం మహిళలను అత్యాచారాలు చేస్తామని తృణమూల్ ఎంపి బహిరంగంగానే బెదిరించాడు. ముస్లిం అబ్బాయిలు హిందూ అమ్మాయిలను మతం మార్చడానికే వివాహం చేసుకుంటున్నారని, దీనికోసం 'లౌ జీహాద్' అనే కార్యక్రమాన్ని రూపొందించారని తప్పుడు ప్రచారానికి దిగారు. ఎండలో ధర్నాలు చేస్తే అందం పాడవుతుందని, నల్లగా ఉంటే పెళ్లవదని గోవా ముఖ్యమంత్రి వాచాలతను ప్రదర్శించారు. బిజెపి ప్రభుత్వాన్ని తన కనుసన్నల్లో నడిపిస్తున్న ఆర్ఎస్ఎస్ మరో అడుగు ముందుకేసి స్త్రీలు సంప్రదాయాలు పాటించాలని, ఇంటిపని, బిడ్డలపెంపకమే ప్రధానమైనదని, బాల్య వివాహాలు మంచివేనని ఏకంగా పాఠ్యపుస్తకాలే తయారు చేసింది. 'బాలికలకు మొబైల్ ఫోన్లు ఇవ్వొద్దు... అందువల్లే అనర్థాలు జరుగుతున్నాయి' అని రాజ్యసభ ఎంపి రాజ్‌పాల్ సింగ్ చెప్పినా, 'అన్నా అని పిలిచి కాళ్లుపట్టుకొని ఉంటే నిర్భయ పై అత్యాచారం జరిగేది కాదు'అని జైలు పాలయినా ఆశారాంబాపు పైత్యాన్ని ప్రదర్శించినా, మహిళల నక్షత్ర గతులు సరిగా లేకపోతే అత్యాచారాలు జరుగుతాయని ఛత్తీస్‌గఢ్ మాజీమంత్రి

వాచాలత చూపినా ఇవన్నీ ఆర్ఎస్ఎస్ ఒక వ్యూహం ప్రకారం ప్రచారం చేస్తున్న గత కాలపు భావజాలంలో భాగమే. నిర్భయపై జరిగిన అత్యాచారం వెనకున్న ఆలోచనలను వెలికితీసే ప్రయత్నం చేసిన "ఇండియాస్ డాటర్" లఘు చిత్రాన్ని బిజెపి నిషేదించడం కూడా ఈ తరహా చర్యే. ఇటువంటి చిత్రాలు ప్రపంచంలో భారత దేశాన్ని తక్కువ చేస్తాయని ఒక కేంద్ర మంత్రి వాపోయారు. పోలీసులు, న్యాయమూర్తులు రాజకీయ నాయకులు కూడా ఈ విధంగా మాట్లాడుతున్నారంటే సమాజంలో బలంగా వెళ్ళూనికొని వున్న ఫ్యూడల్ ఆలోచనలకూ, పితృస్వామ్య ధోరణికిది నిదర్శనం. అధికారంలో ఉన్నవారే ఇటువంటి సంకుచిత ఆలోచనల్తో ఉంటే సమానత్వం సౌభ్రాతృత్వం దేశంలో నెలకొంటుందా? మహిళా విముక్తి సాధించబడ్తుందా? ఎన్నికల్లో మహిళల ఓట్లకోసం తీపి వాగ్దానాలా? ఆచరణలో వాళ్లని అణచిపెట్టే ఆలోచనలా? వీటిని సహించరాదు. సాగనీయరాదు. మహిళలు ఇటువంటి నాయకమణ్యుల్ని నిలదీయాలి.

## ప్రచార – ప్రసార సాధనాలు

శాస్త్ర, సాంకేతిక, సమాచార రంగాల్లో మార్పులు అత్యంత వేగంగా జరుగుతున్నాయి. సమాచారాన్ని వేగంగా అందిస్తున్న మీడియా మహిళల పట్ల , మహిళా సమస్యలను ఫోకస్ చేయడంలో లాభార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తుంది. పితృస్వామ్య ఆధిపత్య భావజాలం ఈ ప్రసారాలలో వ్యక్తమౌతుంది. సినిమాలలో, టివీలలో మహిళను విలాస వస్తువుగా, సెక్స్ సింబల్‌గా, వ్యక్తిత్వం లేనిదిగా, చులకనగా, స్వార్ధపరురాలిగా, కుతంత్రాలు చేసేదిగా, స్త్రీలకు స్త్రీలే శత్రువులుగా చిత్రించటం పెరిగింది. విచ్చలవిడి శృంగారం, అసభ్యత కథా వస్తువులుగా మారాయి. విలాసవస్తువు వాడే పురుషులకు స్త్రీలు దాసోహం అన్నట్లు చిత్రీకరిస్తున్నారు. ఇంటర్‌నెట్‌లో అడ్డూ, అదుపూ లేని అశ్లీల వీడియోలతో యువతరాన్ని చెడుమార్గం పట్టిస్తున్నది. సైబర్ నేరాలు పెరిగాయి. మహిళలను, బాలికలను భయపెట్టి, ప్రలోభపెట్టి వీడియోలు తీసి ఇంటర్‌నెట్‌లో పెడతామని బెదిరించి లొంగతీసుకుంటున్నారు. గ్యాంగ్‌రేప్ చేయడమే కాక వాటిని ఇంటర్‌నెట్‌లో పెట్టటం ఇటీవల పెరిగిన వైపరీత్యం. వినిమయదారీ, టూరిజం సంస్కృతి మహిళలకు తీవ్ర నష్టదాయకంగా మారింది. ప్రజాస్వామ్యవాదుల విధానాల్ని మార్చాలి.

ప్రచార – ప్రసార మీడియా మహిళ పట్ల సదభిప్రాయ ధోరణితో సమాజాభివృద్ధికి తోడ్పడాలి. వికృత చర్యల్ని అరికట్టేలా వ్యవహరించాలి.

బూజుపట్టిన గత కాలపు భావజాలాన్ని తిరస్కరించి అభ్యుదయాన్ని ప్రబోధించే చిత్రాలు, సీరియల్స్‌ను ప్రోత్సహించాలి. స్త్రీల విలువలను దిగజార్చే చిత్రీకరణలను నిరోధించాలి. స్త్రీలు శారీరకంగా దాడులను ఎదుర్కొనే విధంగా శారీరక దారుఢ్యాన్ని పెంచుకునే విధంగా శిక్షణ ఉండాలి. ఆత్మ గౌరవాన్ని ప్రోత్సహించే చర్చలు, వ్యాఖ్యలు, సాంస్కృతిక కార్యక్రమాలు మీడియా ద్వారా ప్రసారం చేయాలి. సామాజికంగా స్త్రీ, పురుష సమానత్వాన్ని సాధించే వైపుగా సమాచార రంగంలో సంపూర్ణ మార్పు రావాలి.

## చట్ట సభల్లో రిజర్వేషన్లు

చట్ట సభల్లో 33శాతం మహిళలకు కేటాయించాలని 1996లో పార్లమెంటులో ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లు ఇంతవరకూ ఆమోదించబడలేదు. స్థానిక సంస్థల్లో పది లక్షల మందికి పైగా మహిళలు ఎన్నికై అనేకమంది స్వతంత్రంగా వ్యవహరించడం పెరిగింది. అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం అని చెప్పుకుంటున్న భారతదేశంలో లోక్‌సభలో మహిళా సభ్యులు 66 మంది మాత్రమే ఉన్నారు. పొరుగు దేశాలైన పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, నేపాల్ కంటే కూడా మనం వెనకబడి ఉన్నాము. నేపాల్‌లో 33శాతం, ఆఫ్ఘనిస్తాన్‌లో 30శాతం, పాకిస్తాన్‌లో 17శాతం మహిళలకు రిజర్వ్ చేయబడ్డాయి. దక్షిణాఫ్రికా దేశాల్లో 40శాతం వరకూ మహిళలు చట్టసభల్లో ఉన్నారు.

మార్క్సిస్టు పార్టీ, వామపక్షాలు మహిళా రిజర్వేషన్ బిల్లును పూర్తిగా బలపర్చాయి. ఆర్ఎస్ఎస్, ఆర్‌జెడి, జెడి, ఎస్‌పి నేతలు బిల్లును తీవ్రంగా వ్యతిరేకించారు. బూర్జువా, భూస్వామ్య పార్టీలు మహిళా రిజర్వేషన్‌లకు అనుకూలమని చెబుతూనే రిజర్వేషన్లకు మొండిచేయి చూపుతున్నారు. రిజర్వేషన్లు రాజకీయ అధికారం కోసం మాత్రమే కాదు. సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక రంగాల్లో సమానత్వాన్ని సాధించేందుకు రాజకీయ రంగంలో సైతం స్త్రీలు తమ వాటాను పొందడం అవసరమని సిపియం భావిస్తుంది. అభ్యుదయ భావజాలం కారణంగానే రిజర్వేషన్స్ అంశం అజెండా మీదకు వచ్చింది. కానీ పితృస్వామ్య ధోరణుల వలన స్త్రీలకు

రిజర్వేషన్స్ కల్పించడానికి రాజకీయ నాయకులు, మత సంస్థలు, మితవాదులు సిద్ధంగా లేరు. ప్రజాస్వామ్యం బలపడటానికి సగ భాగం ఉన్న మహిళలకు రిజర్వేషన్స్ తప్పనిసరి. దానికై సమైక్య ఉద్యమం సాగాలి.

## విధానాల మార్పే మహిళా సాధికారతకు మార్గం

దేశ స్వాతంత్ర్యానంతరం మహిళలపట్ల ఆలోచనల్లోనూ, ఆచరణల్లోనూ కొంతమార్పు వున్నది. అంతకుముందు పురుషులు మాత్రమే వుండే కొన్ని రంగాల్లోకి మహిళలు కూడా ప్రవేశించారు. సామర్థ్యం కూడా రుజువైంది. కానీ 68సంవత్సరాల స్వాతంత్ర్యం తరువాత కూడా మన సమాజంలో వేళ్ళూనుకొని వున్న పితృస్వామ్య వ్యవస్థ విచ్ఛిన్నం కాకపోవడంతో మహిళలపట్ల వివక్ష కొనసాగుతోంది. భూస్వామ్య ఆర్థిక వ్యవస్థను బద్దలుకొట్టలేక పోవడంతో మహిళలపట్ల వివక్ష కొనసాగుతోంది. అదే అభివృద్ధి చెందిన దేశాల్లో భూస్వామ్య వ్యవస్థ బద్దలు కావడంతో మహిళలపట్ల వివక్ష - (పితృస్వామ్య భావజాలం) పట్టు బద్దలైంది. మనదేశంలో ఒకవైపు పితృస్వామ్య సాంప్రదాయాలు, మరోవైపు సరళీకరణ ఆర్థిక విధానాలు మహిళలపట్ల తీవ్రమైన వివక్ష కొనసాగడానికి కారణాలుగా వున్నాయి.

1990-91 తరువాత సమాజంలో తేలిగ్గా డబ్బు సంపాదించే సరళీకరణ ఆర్థిక వ్యవస్థతో  మహిళలపై దాడులు, అత్యాచారాలు ఎక్కువయ్యాయి. పాత సమాజంలోని వివక్షతో కూడిన భావజాలం కొనసాగుతూ రావడమేగాక, సరళీకరణ వ్యవస్థలో వచ్చిన సట్టా వ్యాపారం (స్పెక్యులేటివ్ బిజినెస్) దీనికి కారణం. స్వాతంత్ర్యానంతరం మహిళా సమానత్వంకై వచ్చిన కొన్ని సానుకూల అంశాలను కూడా ఇది దెబ్బతీస్తోంది.

ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యంచేయడం, వస్తువు ఉత్పత్తి రంగాన్ని తగ్గించడం, పెట్టుబడి బాగా పోగుపడటంతో, సామాజికంగా మహిళలకు ఇంతకుముందు లభించిన సాధికారత కూడా ఈ కాలంలో కుదించబడింది. సంఘటిత రంగంలో బహుళజాతి కంపెనీల ఆధిపత్యం పెరగడం, ఎక్కువమంది కార్మికులు అసంఘటితరంగంలో వుండడం మార్కెట్ ఆధిపత్యానికి అవకాశం కలిగింది. దీనితో మహిళాభ్యుదయానికి ప్రమాదం ఏర్పడింది.

మహిళా విముక్తి అనే బృహత్ కార్యాన్ని సాధించాలంటే రాజకీయ ఆర్థిక వ్యవస్థలోని స్పెక్యులేటివ్ బిజినెస్ లక్షణాలతో కూడిన వ్యవస్థ మూలాలమీద పోరాడాలి. మహిళా

విముక్తి మొత్తం ప్రజల విముక్తితో ముడిపడిన సమస్యే అయినా దీనికి ప్రత్యేక కృషి అవసరం. మహిళా సమానత్వం కోసం జరిగే పోరాటాలు ఇతర పోరాటాలతో మేళవించాలి. సమాజంలో పితృస్వామిక భావజాలం ఒకవైపు, శ్రమతో నిమిత్తం లేకుండా సంపాదించాలనే స్పెక్యులేటివ్ ఆర్థిక విధానాలు మరోవైపు మహిళా పురోగమనానికి ఆటంకంగా వున్నాయి. విశాల వేదికలు ఏర్పర్చి విస్తృత స్థాయిలో వీటికి వ్యతిరేకంగా పోరాటలు సాగాలని సిపియం విజ్ఞప్తి చేస్తున్నది.

స్త్రీల సమస్యలు స్త్రీలవి మాత్రమే కావు. మొత్తం సమాజానికి చెందినవి. భారత రాజ్యాంగం హామీ ఇచ్చిన విలువల సాధన కోసం స్త్రీలు అన్ని రకాల అసమానతలను అధిగమించగలగాలి. అసమానతకు మూలంగా ఉన్న ఫ్యూడల్ విలువలు, శ్రమను గౌరవించని నయా ఉదారవాద ఆర్థిక ధోరణులు స్త్రీల సమస్యను సంక్లిష్టంగా మార్చాయి. ఆయా రంగాల్లో స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పోరాడటం ద్వారా మాత్రమే సమానత వైపు, సాధికారత వైపు అడుగులు వేయగలం. మన ముందుతరం మహనీయులు మాటల్లో చెప్పాలంటే ...

- ఆధునిక స్త్రీ చరిత్రను తిరగరాస్తుంది – గురజాడ
- స్త్రీలు పురుషుల కంటే ఉన్నతులు – జ్యోతిబాపూలే
- మగవాళ్ళ మాదిరిగానే ఆడవాళ్ళు శారీరక ధారుడ్యాన్ని పెంచుకోవాలి. లైంగికోన్మాది ఎవరైనా వాళ్ళకి హాని తలపెట్టే ప్రయత్నం చేసినపుడు వాళ్ళని వాళ్ళు రక్షించుకోగల సామర్థ్యాన్ని సంపాదించుకోవాలి. సైన్యంలో చేరి శత్రువుతో పోరాడేందుకు కావల్సినంత శిక్షణ పొందాలి వాళ్ళు – పెరియార్.

నేటి సమాజంలో మహిళలు సమానత్వం, భద్రత, సాధికారతకోసం ప్రజాతంత్ర శక్తులతో కలిసి ఉద్యమించాలని సిపియం విజ్ఞప్తి చేస్తున్నది.

స్త్రీల సమస్యలు స్త్రీలవి మాత్రమే కావు. మొత్తం సమాజానికి చెందినవి. భారత రాజ్యాంగం హామీ ఇచ్చిన విలువల సాధన కోసం స్త్రీలు అన్ని రకాల అసమానతలను అధిగమించగలగాలి. అసమానతకు మూలంగా ఉన్న ఫ్యూడల్ విలువలు, శ్రమను గౌరవించని నయా ఉదారవాద ఆర్థిక ధోరణులు స్త్రీల సమస్యను సంక్లిష్టంగా మార్చాయి. ఆయా రంగాల్లో స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పోరాడటం ద్వారా మాత్రమే సమానత వైపు, సాధికారత వైపు అడుగులు వేయగలం.

భారత రాజ్యాంగం ప్రజలందరికీ చట్టం ముందు సమాన అవకాశాలు కల్పించింది. కానీ సమానమైన సోదరభావంతో మెలిగే ఏర్పాటుకు రాజ్యాంగం ఉద్దేశించబడింది. కానీ కులవ్యవస్థ అనే అసమానత్వాన్ని పునాదిగా కలిగి ఉంది. " అసమానమైన సామాజిక, ఆర్థిక నిర్మాణం మీద రాజ్యాంగ పరిధిలోని సమానత్వాన్ని అమలు చేయడానికి ప్రయత్నం జరుగుతుంది. ఈ ప్రజాస్వామ్య నిర్మాణం కొనసాగాలంటే ఈ ప్రజా జీవనంలోని అన్నిరంగాల్లో సమానత్వం, సౌభ్రాతృత్వం నిర్మించబడాలి"

- డా॥ బి.ఆర్ అంబేద్కర్

వెల రూ. 3/-

సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ కార్యాలయం, 27-13-3, ఆకుల వారి వీధి, గవర్నర్‌పేట విజయవాడ - 2
ఫోన్ నెం. 0866 - 2577202, ప్రచురణ కర్త: పి.మధు, రాష్ట్ర కార్యదర్శి, సిపిఐ(ఎం) పార్టీ, ఆంధ్రప్రదేశ్